యువతకు ఉపాధి లభించేనా..?

- అసంపూర్తి పరిశ్రమలు పూర్తయ్యేనా..
- స్టేషన్‌లోనే రెండు పార్కుల పనులు పెండింగ్
- కొత్త ప్రభుత్వం రాకతో చిగురిస్తున్న ఆశలు


కళ్లెం సమీపంలోని టెక్స్‌టైల్ పార్కు వద్ద కొనసాగుతున్న సబ్‌స్టేషన్ పనులు


శివునిపల్లిలో ఉన్న లెదర్ పార్కు భవనం

లింగాలఘణపురం: జిల్లాలో యువతకు ఉపాధి కల్పించే టెక్స్‌టైల్ పార్క్, లెదర్ పార్కు పనులు గత ప్రభుత్వాల హయాంలో చేపట్టినప్పటికి ఏళ్ల తరబడి పనులు సాగుతూనే ఉన్నాయి. యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పరిశ్రమలను పూర్తి చేయిస్తుందనే ఆశలు చిగురిస్తున్నాయి. లింగాలఘణపురం మండలంలోని కళ్లెం వద్ద టెక్స్‌టైల్ పార్కు, కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో 20 ఏళ్ల క్రితం అప్పుడు మంత్రిగా కడియం శ్రీహరి ఏర్పాటు చేసిన లెదర్‌పార్కు పనులు నేటికీ పూర్తి కాలేదు. మూడు పరిశ్రమలు పూర్తయితే జిల్లాలో సుమారు 25వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కలుగనుంది. ఇప్పటికే జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపాధి లేక హైదరాబాద్, ముంబాయి తదితర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి రావడంతో జిల్లాలోని నిరుద్యోగ యువత పెండింగ్‌లో ఉన్న పరిశ్రమలపై ఆశలు పెట్టుకుంది. అంతేకాకుండా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో టెక్స్‌టైల్ పార్కు కళ్లెం, లెదర్ పార్కు స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉండడం, ఎమ్మెల్యేగా కడియం శ్రీహరి గెలుపొందడంతో ప్రతిపక్షంగా ఉన్నప్పటికి ఎలాగైనా పనులు పూర్తి చేయిస్తాడనే ఆశతో నిరుద్యోగులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్నారు.

కళ్లెంలో మూడేళ్లుగా సాగుతున్న టెక్స్‌టైల్ పార్కు పనులు

మండలంలోని కళ్లెం–ఏనెబావి వద్ద టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో భూసేకరణ జరిగి రూ.25 కోట్లు టెక్స్‌టైల్ పార్కుకు తగిన మౌలిక వసతులకు కేటాయించింది. 2020లో మొదలైన పార్కుకు కేటాయించిన స్థలంలో రోడ్లు వేసి కార్యాలయ భవనం పూర్తి కాగా సబ్‌స్టేషన్, వాటర్ ట్యాంకు పనులు జరుగుతున్నాయి. 500 మందికి టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసుకొనేందుకు యూనిట్లను కూడా కేటాయించారు. ఇందులో ఒక్కొక్క యూనిట్ ఏర్పాటుకు సుమారు రూ.కోటి ఖర్చు కానుంది. ఇవన్నీ యూనిట్ కేటాయించిన లబ్ధిదారులు మాత్రమే పెట్టుబడి పెట్టుకోవాల్సి ఉంటుంది. యూనిట్ ఏర్పాటు అనంతరం ఇక్కడకు దారం తీసుకొచ్చి దుస్తులను తయారు చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేయడం జరుగుతుంది. దీంతో సుమారుగా 10వేల మందికి ఉపాధి లభించనుంది. పనులు పూర్తయ్యే విషయంపై టీఎస్‌ఐఐసీ ఏఈ ఆలోజును వివరణ కోరగా మార్చి వరకు సబ్‌స్టేషన్, ఓహెచ్ఆర్ పనులు పూర్తవుతాయని, ఆ తరువాత ప్లాటుదారులు తమ ప్లాంట్లను ఏర్పాటు చేసుకొని దుస్తులు తయారు చేస్తారని చెప్పారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో లెదర్ పార్కు

సుమారు 20 ఏళ్ల క్రితం స్టేషన్‌ఘన్‌పూర్‌లో అప్పుడు మంత్రిగా పని చేసిన కడియం శ్రీహరి హయాంలో దళితులకు ప్రత్యేకంగా లెదర్ పార్కును ప్రారంభించారు. ఇందులో తోలుకు సంబంధించిన చెప్పులు, బ్యాగులు, బెల్టులు ఇతర వస్తువులన్ని తయారీ చేసి విక్రయిస్తే సుమారు 10వేలకు పైగా నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని అప్పట్లో ఆశపడ్డారు. కొంతకాలం చైన్నైలో మాస్టర్ ట్రైనర్లు వంద మందిని తీసుకెళ్లి శిక్షణ కూడా ఇచ్చారు. అక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న మాస్టర్ ట్రైనర్లు సుమారు 500 మంది నిరుద్యోగులకు ఇక్కడ శిక్షణ ఇచ్చారు. అంతా బాగానే ఉన్నా లెదర్‌పార్కు పనులు మాత్రం ఎక్కడవేసిన గొంగడి అక్కడే ఉంది.


కొడకండ్లలో శంకుస్థాపన చేసిన మినీ టెక్స్‌టైల్ పార్కు శిలాఫలకం


రాళ్లు రప్పలతో ఉన్న మినీ టెక్స్‌టైల్ పార్కుకు కేటాయించిన స్థలం

రూ.61.54 కోట్లతో కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్కు

జిల్లాలోని కొడకండ్లలో రూ.61.54లో మినీ టెక్స్‌టైల్ పార్క్‌ను ఈ ఏడాది అక్టోబర్ 2న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆగమేఘాలతో శంకుస్థాపన చేశారు. అందుకు కేవలం 9 ఎకరాల భూమిని టీఎస్‌ఐఐసీకి కేటాయించారు. ఆ భూమి పూర్తిగా బండలు, గుండ్లు, రాళ్లు, గుట్టలతో నిండి ఉంది. అక్కడ పనులు చేపడితే ఆ భూమిని చదును చేసేందుకే డబ్బులు సరిపోవని భావించిన హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్ అధికారులు అంటిముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

కొత్త ప్రభుత్వం చొరవ చూపిస్తే యువతకు ఉపాధి

నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలోని పరిశ్రమలపై కొంత శ్రద్ధ చూపిస్తే అసంపూర్తి పనులు పూర్తయి యువతకు ఉపాధి లభించనుంది. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలోని పరిశ్రమల పట్ల ఏ విధమైన చొరవ తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

క్లుప్తంగా

మంత్రి సీతక్కను కలిసిన కాంగ్రెస్ నాయకులు



చిల్పూరు: నూతనంగా ఎన్నికైన మంత్రి సీతక్కను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మంగళవారం కలిశారు. మల్కాపూర్ గ్రామానికి చెందిన ఎడవెళ్లి మల్లారెడ్డి, మీదికొండకు చెందిన సూదుల రత్నాకర్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

మంత్రి ప్రభాకర్‌ను కలిసిన కొలిపాక సతీశ్



స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను డివిజన్‌కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీశ్ మంగళవారం హన్మాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా, కరీంనగర్ ఎంపీగా పనిచేసిన ప్రభాకర్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తనదైన శైలిలో పనిచేసి గుర్తింపు పొందారన్నారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు యాదవరెడ్డి, లవన్‌కుమార్, శ్రీకాంత్, విజయ్, బాలరాజు, సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



కొడకండ్ల: పాలకుర్తి చరిత్రను తిరగరాసి భారీ మెజార్టీతో గెలుపొందిన ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డిని కాంగ్రెస్ సోషల్ మీడియా నాయకులు మంగళవారం కలిసి సన్మానించారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ నక్క యాకస్వామి ఆధ్వర్యంలో నాయకులంతా ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డికి శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వంశీకృష్ణ, సతీష్, కొండ శ్రీను, రవి, ఎరుకల సమ్మయ్య, రాజేంద్రప్రసాద్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

బచ్చన్నపేట: మండలంలోని బండనాగారంలో దుర్గామాత ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందజేసినట్లు ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు శివరాత్రి రాజనర్సు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నల్లనాగుల వెంకటాచారి రూ.21వేలు, నిడిగొండ శ్రీనివాస్ రూ.10 వేలు, బండనాగారం గ్రామానికి ఎర్రం నాగభూషణం రూ.21 వేలు, సవాదు మల్లారెడ్డి రూ.21 వేలను విరాళంగా అందించారని చెప్పారు. త్వరలోనే దుర్గామాత పండుగను నిర్వహిస్తామని తెలిపారు. సర్పంచ్ శివరాత్రి కవిత, నాయకులు కొప్పురపు శ్రీనివాస్‌రెడ్డి, జంగిలి ఆంజనేయులు, ఎర్రోజు శ్రీనివాస్, గౌరారం కనుకయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ రంగ పట్టణ కమిటీ ఎన్నిక

బచ్చన్నపేట: మండల కేంద్రంలో బచ్చన్నపేట పట్టణ భవన నిర్మాణ రంగ కార్మికులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణంలో భవన నిర్మాణ రంగ కార్మికుల కమ్యూనిటీ హాల్‌లో సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా చెప్యాల మధురెడ్డి, ఉపాధ్యక్షుడిగా కుకుడాల పుల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా రాగీరు మురళి, సహాయ కార్యదర్శిగా గంధమల్ల నరేష్, కోశాధికారిగా కుక్కుడాల పాండురంగం, ఆర్గనైజర్‌గా టేకులపల్లి సంపత్, సలహాదారులుగా అల్వాల ఎల్లయ్య, రాగీరు సిద్దులు, ఎద్దు ప్రభాకర్, కర్రె లక్ష్మీనారాయణ, అల్వాల రాజులను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందుంటామని చెప్పారు.

వాహనం ఢీ.. గొర్రెల మృతి

కొడకండ్ల: మైదంచెరువుతండాలోని ధరావత్ రెడ్డికి చెందిన పది గొర్రెలు గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాయి. బాధితుడి కథనం ప్రకారం.. గొర్రెల మందను మంగళవారం సాయంత్రం ఇంటికి తీసుకెళ్తున్న క్రమంలో జనగామ–సూర్యాపేట హైవేపై మైదంచెరువు గ్రామ పంచాయతీ సమీపంలో గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో పది గొర్రెలు మృతి చెందాయని, మరో ఐదు గొర్రెల కాళ్లు విరిగినట్లు తెలిపాడు. పోలీసులు గొర్రెల మృతికి కారణమైన వాహనాన్ని గుర్తించి న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన యాట పోశయ్య అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, బీఆర్ఎస్ నాయకుడు కోడూరి శివకుమార్ గౌడ్ బాధితుడికి రూ.5 వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు. అలాగే హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోశయ్యను పరామర్శించి ఆయనకోసం రక్తదానం కూడా చేశారు.

'పొన్నాలకు మతిభ్రమించింది'

రఘునాథపల్లి: మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పొన్నాల లక్ష్మయ్యకు మతిభ్రమించిందని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లూరి పృథ్వీరాజ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శించగా అట్టి ఫొటోను పొన్నాల తన ట్విట్టర్, వాట్సాప్‌లలో పెట్టి కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజార్టీ ఉన్నా త్వరలో ప్రభుత్వం కూలిపోతుందని అనడం సిగ్గుచేటన్నారు. 40 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీలో ఉండి వివిధ పదవులు అనుభవించి కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఫొటోలు పెట్టండి

పాలకుర్తి: నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిల ఫొటోలు పెట్టాలని కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గుగ్గిళ్ల ఆదినారాయణ, బమ్మెర మాజీ ప్రధాన కార్యదర్శి పెందోట వెంకటాచారి కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఫొటోలు ఏర్పాటు చేయాలని అన్నారు.

ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలి


ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

బచ్చన్నపేట: ఆటోలు నడుపుకుంటూ జీవిస్తున్న డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం జీవనోపాధి కల్పించాలని ఆటో డ్రైవర్ల సంఘం మండల అధ్యక్షుడు పస్తం ఐలయ్య కోరారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో మంగళవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పోలీసుల జోక్యంతో ధర్నాను విరమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 250 మంది ఆటోలపై జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. కుటుంబాన్ని పోషిస్తూ పిల్లలను చదివించుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు మహాలక్ష్మి పథకంలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేయడయంతో ఆటోల్లో వారు ఎక్కడం లేదన్నారు. దీంతో ఆటోలకు డీజిల్ ఖర్చు తప్ప ఆదాయం ఏమీ రావడం లేదన్నారు. ఉచిత ప్రయాణ పథకం ఇలాగే కొనసాగితే తమ జీవనోపాధి కోల్పోయి కుటుంబాలు వీధిన పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను దృష్టిలో పెట్టుకొని తమకు జీవనోపాధి కల్పించే మార్గాలను చూపించాలని కోరారు. నాయకులు దూడల సిద్దులు, జూకంటి గణేష్, కంటెం కనుకయ్య, సందెల లక్ష్మణ్, బొలుగుల లక్ష్మణ్, ఎండీ. యాకూబ్, సిరిపాటి అయిలయ్య, ఎద్దు రమేష్, తవిటి భాస్కర్, మామిడి ఐలయ్య పలువురు పాల్గొన్నారు.

'స్థానికం'లోనూ ఇదే ఉత్సాహం కొనసాగించాలి

కొడకండ్ల: త్వరలో జరుగబోవు స్థానిక ఎన్నికల్లోనూ అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన ఉత్సాహాన్నే కొనసాగించి గెలుపు కోసం కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్ కోరారు. రామన్నగూడెం, బోడోనికుంట తండాల్లో మంగళవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యేగా మామిడాల యశస్వినిరెడ్డి గెలుపునకు పనిచేసిన వారికి కృతజ్ఞతలు తెలుపుతూ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక సమరానికి ప్రతి కార్యకర్త సన్నద్ధమై పార్టీ బలపర్చే అభ్యర్థుల గెలుపునకు పనిచేయాలన్నారు. మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖలీం, నాయకులు అంజయ్య, సునీల్ రెడ్డి, రవి, సోమన్న, నర్సింహ్మా, రాము, సూర్య, యాకూబ్, రెడ్యా, శ్యామ్, సురేష్, సీమా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సురేష్‌నాయక్

ఈ-కేవైసీ కోసం వినియోగదారుల తిప్పలు


ఈ-కేవైసీ కోసం బారులుదీరిన గ్యాస్ వినియోగదారులు

కొడకండ్ల: ఈ–కేవైసీ కోసం భారత్ గ్యాస్ వినియోగదారులు బారులుదీరి ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగు రోజులుగా మండలకేంద్రంలోని గ్యాస్ కార్యాలయానికి ఉదయమే వినియోగదారులు చేరుకొని క్యూ కడుతున్నారు. ఈ–కేవైసీ చేసుకొంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం అందించే రూ.500కే గ్యాస్ సిలిండర్ వస్తుందనే తప్పుడు ప్రచారంతో గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వినియోగదారులు కార్యాలయానికి వచ్చి నిలువ నీడ లేక రోడ్డుపై బారుదీరుతూ అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈకేవైసీకి నిర్దేశిత గడువేమి లేదని, అవసరమైతే గ్రామాలకే వచ్చి చేస్తామని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నప్పటికీ వారు మాత్రం కార్యాలయానికి వస్తున్నారు. ఈ–కేవైసీపై వినియోగదారులకు అవగాహన లేకపోవడంతోనే కార్యాలయానికి వచ్చి ఇబ్బందులు పడుతున్నందున అధికారులు చొరవ తీసుకొని గ్రామాల్లో దండోరా వేయించి వారికి అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రెయినేజీ అధ్వానం



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి జంటపట్టణమైన శివునిపల్లిలో పారిశుద్ధ్యం పడకేయడంతో ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ప్రధానంగా గ్రామంలో 6వ వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారగా కాలనీవాసులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, అందులో నీరు సాఫీగా వెళ్లేందుకు సరైన ఏర్పాట్లు లేవని ఏళ్లతరబడి కాలనీవాసులు అధికారులకు విన్నవిస్తూనే ఉన్నారు. అయినా తూతూమంత్రంగా పనులు చేస్తూ మమ అనిపిస్తున్నారు. దాంతో మురుగునీరు డ్రెయినేజీ ద్వారా వెళ్లే ఏర్పాట్లు సరిగ్గా లేక నీరంతా అక్కడే నిలిచిపోవడంతో పరిసర ప్రాంతాల ప్రజలు దుర్వాసనతో అవస్థల పాలవుతున్నారు. చెప్పినా పంచాయతీ అధికారులకు పట్టడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. దుర్వాసనకు తోడు దోమలు, పందుల బెడద ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై నా పంచాయతీ అధికారులు స్పందించి నీరు నిలువకుండా పాత డ్రెయినేజీని కూల్చి అక్కడ నుంచి మురుగునీరు వెళ్లేలా కొత్తది నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పరామర్శ


సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే కడియం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన మర్రి వెంకటయ్య, ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రానికి చెందిన కురుమ సంఘం పెద్దమనిషి అమరాజి బుచ్చయ్య, బీఆర్ఎస్ కార్యకర్త మునిగెల స్వామి అనారోగ్యంతో మృతి చెందారు. కాగా బాధిత కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం పరామర్శించారు. మృతదేహాలను సందర్శించి పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. సంతాపం తెలిపిన వారిలో బీఆర్ఎస్ నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, నీల గట్టయ్య, పల్లె రవీందర్, బూర్ల శంకర్, మునిగెల వెంకటేశ్వర్లు, పెసరు సారయ్య, లింగనబోయిన శ్రీను, మంద రాజు తదితరులు ఉన్నారు.

రఘునాథపల్లి: మండలంలోని గోవర్దనగిరికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కుసుంబ శంకర్ రావు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలియగానే ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రజల ఆకాంక్ష నెరవేరనుంది


మాట్లాడుతున్న రవి

చిల్పూరు: రానున్న వంద రోజుల్లో తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరనుందని, ఆ దిశగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, స్టేషన్‌ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మంగళవారం చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో పార్టీ జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు గడ్డమీది సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రవి మాట్లాడారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నామినేటెడ్ పోస్టులు రద్దు చేయడం జరిగిందని, ఇక నుంచి ప్రజాప్రభుత్వం కొనసాగుతుందన్నారు. పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, ఎంపీటీసీలు కుమార్, యాదగిరి, పాశంశిరీష సురేష్, నాయకులు శ్రీరాములు, తీగల మహేందర్, యశ్వంతరెడ్డి, మల్లారెడ్డి, దుర్గాప్రసాద్, మూల నాగరాజు, తాటి సునీల్, బొల్ల రాజ్‌కుమార్, పవన్, శేఖర్, పుట్ట కిరణ్‌రెడ్డి, బుచ్చయ్య, శాగంటి మణి, ఊమ్లానాయక్ పాల్గొన్నారు.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన పూజ


పూజలో పాల్గొన్న భక్తులు

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్తజనసందోహం నడుమ 108 బంగారు పుష్పాలతో అష్టదళ పాద పద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, అభివృద్ధి కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మాలతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు వేద మంత్రాల నడుమ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్రనాగరాజు, కుంచాల సంపత్‌రాజు, శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది రమేష్, వీరన్న, మల్లికార్జున్, లక్ష్మి, స్వరూప, కృష్ణ, మహేష్, హరిశంకర్, రాజేష్, విశాల్, శేఖర్, అజయ్, రాములు, వసంత పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు


రక్తదానం చేస్తున్న ఫార్మసీ కళాశాల విద్యార్థిని

జనగామ రూరల్: పూర్వ లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ 75వ జన్మదినం సందర్భంగా మంగళవారం లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ అధ్యక్షుడు భాష్యం రఘు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బస్టాండ్ వద్ద ఉచిత మధుమేహ పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అలాగే జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంక్షేమ ఆస్పత్రిలో అన్నప్రసాద వితరణ, వికాస్ ఫార్మసీ కళాశాలలో రక్తదాన శిబిరం చేపట్టారు. ఈ సందర్భంగా లయన్స్ ప్రతినిధులు కన్నా పర్శరాములు, రీజియన్ చైర్మన్ కదిరె రాజశేఖర్‌రెడ్డిలు పెద్ది వెంకటనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. క్లబ్ కార్యదర్శి పాశం శ్రీశైలంప్రవీణ్, అడ్వకేట్ వి.ప్రసాద్‌రావు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి


నినాదాలు చేస్తున్న మాదిగ యూత్ నాయకులు

జనగామ రూరల్: ఈ నెల 17,18న వర్గీకరణ హామీని అమలు చేయాలని తెలంగాణ మాదిగ యూత్ జాక్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పిడమర్తి రవి ఆధ్వర్యంలో చెపట్టనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాక్ రాష్ట్ర కార్యదర్శి గండి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలో ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీల పేరుతో ఎస్సీ వర్గీకరణను కాలయాపన చేయకూడదన్నారు. ప్రధాని ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 12 శాతం రిజర్వేషన్ కల్పించడంతోపాటు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలన్నారు. యాదగిరి, యాకయ్య, ప్రభాకర్, శ్రీహరి, ఎల్లయ్య, మల్లేష్, ఆనంద్, మధు పాల్గొన్నారు.

అన్నదానం

దేవరుప్పుల: జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంక్షేమ ఆస్పత్రిలో జరిగే ఉచిత నిత్య అల్పాహారంలో భాగంగా దేవరుప్పుల లయన్స్‌క్లబ్ పూర్వ అధ్యక్షుడు గోలి చిన్నఉప్పల్ రెడ్డి కుమార్తె సింధు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ జైన రమేష్, పూర్వ గవర్నర్ కన్నా పరశురాములు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఈదునూరి నర్సింహారెడ్డి పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రానికి చెందిన సాయిదాబా యజమాని దాట్ల యాకన్న బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

సంక్షిప్త సమాచారం

సర్పంచ్ దుశ్చర్యలపై చర్య తీసుకోవాలి

దేవరుప్పుల: మండలంలోని ధరావత్‌తండా సర్పంచ్ గేమానాయక్ దుశ్చర్యలపై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ధరావత్ రవీందర్‌నాయక్ ప్రభుత్వ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి వివరాలు సమాచార హక్కు చట్టం ప్రకారం ఇవ్వాలని మంగళవారం పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. అలాగే ఎన్నికల సమయంలో బానోత్ దేవిని బెదిరించి పృథ్వీరెడ్డి, వంశీలపై అక్రమ కేసులు నమోదు చేయించిన విషయమై ఎస్సైకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత

దేవరుప్పుల: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు చింత యాకయ్య (దొడ్ల) పెద్ద కుమార్తె శ్రీలత (25) అనారోగ్యంతో మృతి చెందింది. కాగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి మంగళవారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

సోషల్ మీడియాలో 'మహాలక్ష్మి' దరఖాస్తు వైరల్

దేవరుప్పుల: తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల పథకం అమలులో సోషల్ మీడియా అత్యుత్సాహం పెల్లుబికుతోంది. మంగళవారం సోషల్ మీడియా, వాట్సాప్‌ల ద్వారా మహాలక్ష్మి పథకం కింద రూ.2,500 పొందేందుకు కావాల్సిన దరఖాస్తు నమూనా చక్కర్లు కొట్టింది. దీంతో పలువురు మహిళలు మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాలను వాకబు చేసే పనిలోపడ్డారు. ఈ విషయమై మండల అభివృద్ధి అధికారి వడ్డేపల్లి ఉమామహేశ్వర్‌ను వివరణ కోరగా ఈ పథకంపై తమకు ప్రభుత్వ పరంగా ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పడం గమనార్హం.